**పనిపాటలయందె మీ బ్రతుకంత తెల్లారె**
**ఇదియె సాధనయని ఎంచినార?**
**మూడు పూటలు మీరు భుజియించి తృప్తిగా**
**ఇదియె సాధనయని ఎంచినార?**
**అలసటదీరగా హాయిగా నిదురించి**
**ఇదియె సాధనయని ఎంచినార?**
**ఇందుకా దేవుడు మిమ్ము సృష్టించినాడు?**
**తెలివితేటలు కల్గియు తెలిసికొనక**
**కాలమంతయు నూరక గడుపనేల?**
**ఇప్పుడైనను దైవంబు నెరుగరయ్య**
**ఇదియె సాధనయంచు నెంచరయ్య**

**ప్రేమస్వరూపులారా!** సర్వత్రా వ్యాపించియున్న చైతన్యమునకే 'దైవము' అని పేరు పెట్టారు. 'దైవము సర్వభూతాంతరాత్మ'యని చెబుతూ వచ్చారు. కాని, మానవునిలో దైవశక్తి ఇమిడి యున్నదని చెబితే కొంతమంది అంగీకరించరు. ప్రతి జీవియందు దైవత్వము వెలుగుచున్నది. కేవలము మానవునియందు మాత్రమే కాదు; సకల ప్రాణులయందు ఒకే ఆత్మతత్త్వము ఉంటున్నది. అయితే, అట్టి ఆత్మను సాక్షాత్కరింపజేసుకోవాలంటే మీ హృదయము నిర్మలంగా, నిస్స్వార్థంగా ఉండాలి. అందునిమిత్తమై భగవచ్చింతన చేయాలి. భగవచ్చింతన ద్వారానే మీ హృదయం చల్లబడుతుంది, తెల్లబడుతుంది (పవిత్ర మవుతుంది). హృదయము పవిత్రమైన తక్షణమే భగవంతుడు కనిపిస్తాడు. ఇదే మీరు చేయవలసిన సాధన. అంతేగాని, ధ్యానము పేరిట కళ్ళు మూసుకుని కూర్చున్నంత మాత్రమున భగవంతుడు కనిపించడు.

భగవంతుడు మానవులయందు, క్రిమికీటకాదులయందుకూడా సమంగానే ఉన్నాడు. ఇప్పుడు భగవంతుడు ఎక్కడున్నాడని మీరు ప్రశ్నిస్తే.... మీయందుకూడా ఉంటున్నాడు. ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలని అనేకమంది ధ్యానము, ఇంకా అనేక ఇతర సాధనలు చేస్తున్నారు.

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**వందనం అర్చనం దాస్యం స్నేహ మాత్మనివేదనం**

ఈ నవవిధ మార్గములద్వారా భగవంతుని చేరుకోవచ్చునని నారదుడు చెప్పాడు. భగవంతుడు మీ హృదయమునందే ఉన్నాడు. ఇటువంటి సర్వవ్యాపిని, సర్వాంతర్యామిని దర్శించడానికి ధ్యానము కావలెనా? ఈనాడు కొంతమంది బోధకులు ధ్యానము చేయడానికి అనేక మార్గములు చెబుతున్నారు. అయితే, ధ్యానముగాని, మరే ఇతర సాధనగాని కేవలం చిత్తశుద్ధి నిమిత్తమే చేస్తున్నాము. చిత్తశుద్ధికోసమనే ప్రపంచంలో ఇన్ని విధములైన సాధనలు ఏర్పడుతున్నాయి. చిత్తశుద్ధి ఉన్నప్పుడే భగవత్సాక్షాత్కారము కలుగుతుంది. చిత్తశుద్ధి లేకుండా ఎన్ని సాధనలు చేసినప్పటికీ భగవంతుడు లభ్యం కాడు.

అసలు భగవంతుని చూడడానికి ఏ సాధనలూ అక్కరలేదు. భగవంతుడు నీకంటే వేరుగా ఉన్నాడని భ్రమించి, ఆయనను దర్శించే నిమిత్తం నీవు ఉపవాసములు, ధ్యానము మొదలైన సాధనలు చేస్తున్నావు. నీవు విశ్వసించినా, విశ్వసించకపోయినా భగవంతుడు నీయందే ఉన్నాడు. అంతేకాదు, సర్వత్రా వ్యాపించియున్నాడు. కాని, చిత్తశుద్ధి లేనివారికి దర్శనమివ్వడు. దైవదర్శనము చేసుకోవాలంటే చిత్తమును పరిశుద్ధం చేసుకోవాలి. హృదయ పవిత్రతకోసమే మనము ఇన్ని సాధనలు చేస్తున్నాము. పవిత్రమైన హృదయముకోసమై మానవుడు దైవాన్ని ప్రార్థించాలి. పాత్రను తోముతుంటే అది ఏవిధంగా కాంతిమంతమవుతుందో, అదేవిధంగా, భగవత్ప్రార్థన చేసేకొలదీ హృదయం నిర్మలమైపోతుంది. నీవొక రూమునందు ఒంటరిగా కూర్చుని కళ్ళు మూసుకుని ధ్యానము చేస్తే సరిపోదు. భగవంతుని సర్వత్రా చూడాలి. భగవంతుడు నీయందే ఉన్నాడు, నీ చుట్టూ ఉన్నాడు. కాని, మీకు

ఈ సత్యాన్ని బోధించే గురువులు చాలా అరుదుగా ఉన్నారు. 'భగవంతుడు నాయందు, నీయందు, సర్వుల యందు ఉన్నాడు. సర్వత్రా ఉన్నవాడు భగవంతుడే', అని గుర్తించి వర్తించాలి. కాని, ఇట్టి ధ్యానమును ఈనాడు ఎవ్వరూ చేయడం లేదు. భగవంతుని చూడాలనుకుంటే మీ చిత్తము పరిశుద్ధము కావాలి. భగవంతుడే మీ తల్లిగా కనిపిస్తుంటాడు, తండ్రిగా కనిపిస్తుంటాడు. వారిని చూసినప్పుడు, 'ఇదిగో, భగవంతుడు నాకు ఈ రూపంలో సాక్షాత్కరించాడు', అనుకోవాలి. సర్వులయందు ఉన్నది ఆత్మయే. పెళ్ళి చేసుకున్న తరువాత వచ్చినామెను 'నా భార్య' అంటావు. కాని, నిజానికి ఆమె నీ భార్య కాదు; ఆత్మస్వరూపిణి. కొంతకాలానికి నీకొక పిల్లవాడు పుడతాడు. 'కుమారా! కుమారా!' అంటూ వానిని ముద్దు పెట్టుకుంటావు. కాని, వాడు నీ కుమారుడు కాదు; ఆత్మస్వరూపుడే! ఈవిధంగా, అందరిమధ్య ఉన్నది ఆత్మసంబంధమే. లౌకికమైన సంబంధ బాంధవ్యాలన్నీ కేవలం దేహభ్రాంతివల్లనే కలుగుతున్నాయి.

జీవబ్రహ్మైక్యమే నిజమైన ఆత్మసాక్షాత్కారము. నీకు కనిపించే ప్రతి వ్యక్తీ దైవస్వరూపుడే. దేవుడే లేక మనిషి ఏరీతిగా ఉండగలడు? శ్రీకృష్ణుడు వాగ్దానం చేశాడు, 'ధర్మసంస్థాపనార్థం నేను ప్రతి యుగములోను అవతరిస్తాన'ని. 'అందరియందున్న ఆత్మస్వరూపమే నేన'ని ప్రకటించాడు. లౌకికమైన సంబంధ బాంధవ్యములకు తాను ఏనాడూ కట్టుబడలేదు. ఈ సత్యాన్ని ఎరిగిన గోపికలు 'కృష్ణా! కృష్ణా!' అంటూ నిరంతర కృష్ణనామస్మరణతో కాలం గడుపుతూ వచ్చారు. 'అందరియందు కనిపించేది మా కృష్ణుడేగాని, మరొకరు కాదు', అని వారు విశ్వసించారు. ఇట్టి సాక్షాత్కారమును వారు అనుభవించ గల్గటానికి కారణం వారి హృదయ పవిత్రతయే. అందరియందున్న ఆత్మకు బంధుత్వమును ఆపాదించడం భౌతికమైన లక్షణము.

ఒక పర్యాయం కృష్ణుడు రాధ చెల్లెలితో చెప్పాడు, 'నీ భర్త యందుకూడా నేనున్నాను. అందు గలనని, ఇందు లేనని సందేహము వలదు. నేను సర్వవ్యాపిని. నీకు ప్రత్యేకంగా భర్తగాని, తల్లిదండ్రులు గాని వేరుగా ఎవ్వరూ లేరు. ఈ సంబంధ బాంధవ్యాలన్నీ నేను కల్పించినవే. వీరందరినీ కల్పించినవాడను నేనే", అని చెప్పాడు. జీవులు మోహస్వరూపులు, కృష్ణుడు మోహనస్వరూపుడు. అన్ని రూపనామములూ కృష్ణునియొక్క ప్రతిబింబములే. కృష్ణుడు ఒక 'కాస్మిక్ పవర్'. ఈవిధంగా చెబితే కొందరు దీనిని అంగీకరించరు. ఈ సత్యమును కేవలం గోపికలు, రాధ మాత్రమే తెలుసుకున్నారు.

'ఇది హాలు, ఇది పెండాలు, ఇది పెద్ద భవనము, ఇది చిన్న భవనము' అని మనము రూపమును చూసి భ్రమిస్తున్నాముగాని, నిజానికి ఈ జగత్తులో మనము చూసేదంతా ఆత్మస్వరూపమే. పెండాలును, భవనమును మనమే నిర్మించుకొని, వాటికి ఆయా పేర్లు పెడుతున్నాము. అదేరీతిగా, భగవంతుణ్ణి కూడా మనము కల్పితమైన రూపనామములకు పరిమితం చేస్తున్నాము. ఇట్టి సత్యాన్ని ఒక్క గోపికలు మాత్రమే గమనించారు. వాళ్ళు కృష్ణుణ్ణి సర్వత్రా దర్శించ గలిగారు. జగత్ వ్యవహారరీత్యా, 'నా కుమారుడు, నా బావమరిది, నా తమ్ముడు, నా అన్న, నా మామ', అని ఒక్కొక్కరిని ఒక్కొక్కరీతిగా సంబోధిస్తున్నాముగాని, నిజానికి భగవంతుడే ఆయా శరీరములలో చేరి మనకు గోచరమవుతున్నాడు. ఈవిధంగా, మనము ప్రతి వ్యక్తినీ దైవస్వరూపంగా భావించాలి. ఈ జగత్తంతయు నిండినది బ్రహ్మ తత్త్వమే. దివ్యత్వము జీవత్వముతో మనకు గోచరమవుతున్నది. దైవస్వరూపము జీవస్వరూపముగా కనిపిస్తున్నది. రూపనామములన్నీ కల్పితములే!

రామకృష్ణ పరమహంస జగన్మాతను అనేకరీతులుగా పూజిస్తూ వచ్చాడు. ఒకనాడు జగన్మాత ప్రత్యక్షమై, 'రామకృష్ణా! నీవొక పిచ్చివానిగా తయారవుతున్నావు. నన్ను ఒక ప్రత్యేకమైన రూప నామములకు ఎందుకు పరిమితం చేస్తున్నావు? అన్ని రూపములలో ఉన్నది నేనే. ఈ రూపములన్నీ కల్పితములే. ఎవరిని చూసినా, 'ఇతను దైవమే' అని భావించు', అని బోధించింది. ఈ రూపములో కనిపించేది, ఆ రూపములో కనిపించేది భగవంతుడే! నీవు భగవంతుని చూడాలనుకుంటే, ఒక్క ఆత్మతత్త్వముగా తప్ప అన్యముగా గోచరము కాదు. 'అతడు ఉద్యోగి, ఇతను వ్యాపారి', అని ఈరకంగా మనం భావిస్తుంటాం. అయితే, ఎవరిని చూసినా 'ఇతను ఆత్మయొక్క ప్రతిబింబమే', అని భావించాలి.

భగవంతుడు ఎవరు? నిర్గుణుడు, నిరంజనుడు, గుణాతీతుడు. ఒక ప్రత్యేకమైన రూపము కలిగినవాడు కాదు. మానవత్వము దైవము యొక్క ప్రతిబింబమే. కనుక, మనం ప్రతి మానవుని దైవంగా భావించి

గౌరవించాలి, సంతోషపెట్టాలి. దైవము సర్వత్రా ఉన్నప్పటికీ సేవలు చేసి ప్రపంచానికి ఒక ఆదర్శాన్ని అందించే నిమిత్తమై మానవ రూపమును ధరిస్తాడు. మీరు నేటినుండి 'దైవము ఎక్కడ చూసినా ఉన్నాడు. ఎవరిలో చూసినా ఉన్నాడు', అనే సత్యాన్ని గుర్తించి వర్తించండి. అప్పుడే మీకు దైవసాక్షాత్కారము కలుగుతుంది.

ఒక్క భగవంతుని చేయి మనము పడితే ప్రపంచమే మన హస్తగతమవుతుంది. కనుక, భగవంతుని సంతోషపెట్టే సాధన చేయాలి. ఆయనను పొందుటకు తగిన మార్గాన్ని అనుసరించాలి. మీరు ఒకతూరి మధురకు, ద్వారకకు వెళ్ళి చూడండి. కృష్ణుడు ఏనాడో ద్వారక విడిచి వెళ్ళాడు. కాని, ఇప్పటికీ ప్రజలు ఎంతో భక్తిప్రపత్తులతో కృష్ణుని ప్రత్యక్ష దైవముగా భావించి పూజిస్తూ వస్తున్నారు. భగవంతుడు మానవాకారము ధరించినప్పుడు, దైవత్వమును గుర్తించలేనివారు ఆయనను సామాన్య మానవునిగానే భావిస్తారు. ఈవిధంగా దైవత్వమును మానవత్వముగా భావించడం చాలా పొరపాటు. నేను భగవంతుడనని మీరంటున్నారు. అయితే, నా మాటలు వింటున్న మీరు కూడా భగవత్స్వరూపులే. భగవంతుడు మీకంటే వేరుగా ఉన్నాడని మీరు భావించకూడదు. 'మేమంతా భగవంతుని బిడ్డలమే. భగవత్ స్వరూపులమే', అని భావించండి. తప్పక మీకు భగవంతుడే సర్వత్రా కనిపిస్తాడు. 'యద్భావం తద్భవతి', మీకు కనిపించేదంతా భగవత్స్వరూపమని భావిస్తే తప్పక భగవంతుడు చిక్కుతాడు. ఈనాడు భగవంతునియొక్క తత్త్వము ఎవ్వరికీ తెలియదు కనుక, 'ఈమె తల్లి, ఇతను తండ్రి, ఇతను కుమారుడు', అని ఈవిధంగా పలుకుతూ వస్తున్నారు. రూపమును బట్టి సంబంధ బాంధవ్యము వస్తుంది. ఈ సంబంధ బాంధవ్యములను సత్యముగా తీసుకుంటే చాలా మోసమైపోతుంది.

'నేను పరబ్రహ్మ స్వరూపుడను. నాకంటే వేరు ఈ జగత్తులో ఎవ్వరూ లేరు', అన్నాడు కృష్ణపరమాత్ముడు. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి'. ఒక్కొక్కరు ఒక్కొక్క పేరుతో పిలిచినప్పటికీ ఉన్నది ఒక్కటే. ఒకటికి మూడు చేర్చి నాలుగు అంటున్నాము. ఒకటే లేకపోతే నాలుగు ఎక్కడినుండి వస్తుంది? ఈవిధంగా సంబంధ బాంధవ్యములన్నీ మనమే చేర్చుకుంటున్నాము. కాని, దైవత్వము చేర్చేది కాదు, కూర్చేది కాదు. 'దేవుడు వేరు, జీవుడు వేరు' అని మీరనుకుంటున్నారు. కాని, నిజానికి జీవుడే లేడు. మరి, ఎందుకు పుడుతున్నారు? ఎందుకు చస్తున్నారు? అని మీరు ప్రశ్నించవచ్చు. ఆత్మకు చావు అనేదే లేదు. ఆత్మతత్త్వాన్ని గుర్తించుకోలేకపోవడంచేతనే పుడుతున్నారు, చస్తున్నారు. ఆత్మను గుర్తించనంతవరకు జీవుడు జీవుడుగానే, దేవుడు దేవుడుగానే ఉంటాడు; గుర్తించుకున్నవాడు దేవునిలో లీనమైపోతాడు. వేదము, 'ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ' అని చెప్పడం ఎందుకోసం? రెండవది లేదు కనుకనే, 'ఉన్నది ఒక్కటే' అని చెబుతున్నది. 'నేను నీవే, నీవు నేనే'. 'తత్ త్వం అసి'. ఇదే వేదవాక్యము. 'ప్రజ్ఞానం బ్రహ్మ'. ప్రజ్ఞానమే భగవంతుడు. ఈ సత్యాన్ని విప్పిచూడడం లేదు కనుకనే చాలామంది 'దైవము వేరు, నేను వేరు' అని అనుకుంటున్నారు.

మీరు కోరవలసింది దైవాన్నే. దైవము ఒక్కడే. రాముడు వేరు, కృష్ణుడు వేరు అని భేదము పెట్టుకోకూడదు. ఈ భేదమును మీరు పాటించడంచేత దైవత్వమునకు దూరమై జీవత్వముతోనే బ్రతుకు సాగిస్తున్నారు. 'నేను, భగవంతుడు ఒక్కడే. నాలోనే భగవంతుడున్నాడు', అనే నమ్మకాన్ని దృఢంగా పెట్టుకుంటే, దైవము తప్పక సాక్షాత్కరిస్తాడు. ఈ భేద భావములన్నీ నీలో పుట్టినవేగాని, భగవంతునిలో పుట్టలేదు. భగవంతుడు వేరుగా లేడు, నీలోనే ఉన్నాడు. నీవే భగవంతుడవు. అట్లుకాకపోతే, వేదములు 'తత్ త్వం అసి' అని ఎందుకు చెబుతాయి? 'ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ' అని ఎందుకు పలుకుతున్నాయి? రెండుగా కనిపించేది నిజానికి ఒక్కటే అని ఎప్పుడు గుర్తిస్తావో అప్పుడే దివ్యానందాన్ని అనుభవిస్తావు.

'దైవము, నేను ఒక్కటే' అనే భావాన్ని నీవు దృఢం చేసుకున్నప్పుడు భగవంతుడు నీతో ఏకమైపోతాడు. 'అతను వేరు, నేను వేరు' అని భావించకు. నీ హృదయంలో భగవంతుడు కావాలని కోరుకుంటే, నీ భావాన్ని, హృదయాన్ని పరిశుద్ధం చేసుకో. అప్పుడే నీవు, దైవము ఒక్కటైపోతారు. ఈవిధంగా, దైవత్వముతో ఏకత్వము కావాలి. ద్వైతము ఉండకూడదు. పది ఒకట్లు చేరితే 10 అవుతుంది. ఒకటే లేకపోతే పది కావడానికి వీలుకాదు. పది, నూరు, వెయ్యి... వీటన్నింటిలో ఉన్నది ఒకటే. అదేరీతిగా, సత్యము ఒక్కటే. ఆ ఒకటిని పట్టుకో. ప్రక్కన ఎన్ని జీరోలైనా పెట్టుకో, విలువ పెరుగుతుంది. ఆ ఒకటే హీరో. అదే దివ్యత్వము. ఆ ఏకత్వముపై దృష్టి

పెట్టుకుంటే అనేకత్వము మరుగునపడిపోతుంది. 'అతను వేరు, నేను వేరు' అని భావిస్తే అనేకత్వము పెరిగిపోతుంది.

మీరు మీ ఇంట్లో సాయిబాబా ఫోటోలు ఎన్నో పెట్టుకుంటారు. ఫోటోలు ఎన్నైనా అన్నింటిలో ఉన్న సాయిబాబా ఒక్కడే. ఈరీతిగా, అందరినీ ఏకంగా భావించుకున్నప్పుడే మీకు సత్యం బోధపడుతుంది. నేనే చెప్పే వాక్యములన్నీ పరమ సత్యములే. కాని, మీకు నమ్మకము లేకుండా ఉన్నది. ఈ సత్యాన్ని మీరు నమ్మండి. మిగిలినవన్నీ అసత్యమే. అవన్నీ భక్తులను భ్రమలో ముంచివేస్తున్నాయి. నిజంగా భక్తి కలిగినవాడు, 'దేవుడు ఒక్కడే' అని విశ్వసిస్తాడు. అట్టి నమ్మకాన్ని పెంచుకున్నప్పుడే మీకు సత్యము బోధపడుతుంది. సత్యము తెలుసుకుంటే సందేహాలుండవు. మీరు సత్యాన్ని తెలుసుకోండి. ఎవ్వరినీ దూషించకండి. దూషణ, భూషణ, తిరస్కార, పురస్కారములన్నీ మీరు కల్పించుకున్నవే. ఈనాడు ఒకడు మీకు విరోధిగా ఉండవచ్చు. రేపటికి మీరిద్దరూ స్నేహితులు కావచ్చు. నిజానికి అందరూ ఏకత్వంతో కూడినటువంటి స్నేహితులేగాని, పరాయివారు కారు.

ప్రేమస్వరూపులారా! మీరు ఎంతో ప్రేమతో భగవంతుని ప్రార్థిస్తున్నారు. అట్టి నమ్మకమును, ప్రేమను పెంచుకోండి. అప్పుడే మీకు సర్వమూ అర్థమవుతుంది; మీరు ఏ సందేహములకూ చోటివ్వరు. సందేహము ద్వైతముతో చేరినది. నిజానికి 'అతను, నేను' అనే ద్వైతము లేనే లేదు. అంతా 'నేనే'. అటువంటి భావాన్ని మీరు అలవరచుకోండి. ఏకత్వాన్ని విశ్వసించండి. దైవము ఒక్కడే అని మీరు విశ్వసించకపోతే – ఒక దైవాన్ని పూజించడం, వేరొక దైవాన్ని దూషించడం జరుగుతుంది. మనము ఏకత్వమును మాత్రమే తీసుకోవాలి. ఏకత్వమే సత్యము. మీకది సత్యమనిపించకపోతే వదలిపెట్టండి. అంతేగాని, 'ఇది సత్యము కాదు' అని వాదించకండి. దైవత్వానికి ద్వైతమును ఆపాదించకండి. అందరికీ తండ్రి భగవంతుడే. కాబట్టి, ఏకత్వాన్ని అభివృద్ధిపరచుకోండి. ఈనాడు ఇది మీకు అర్థం కాకపోవచ్చునుగాని, సత్యాన్ని గుర్తించిన తరువాత సుస్పష్టంగా అర్థమవుతుంది.

(స్వామి ఒక పూలగుత్తిని చూపిస్తూ...) ఇదొక పూలగుత్తి. అనేక పుష్పములను ఒక దారముతో కూర్చినప్పుడు ఇదొక గుత్తి మాదిరి తయారైంది. ఈ పుష్పములలోని దారమువలె దైవత్వము అందరిలోనూ అంతర్లీనంగా ఉన్నది. ఏకత్వములో అనేకత్వము చేరింది, అనేకత్వములో ఏకత్వము చేరింది. ఆ ఏకత్వమే దైవత్వము. కాని, మీరు అనేకత్వమును చూస్తున్నారు, చేస్తున్నారు, అనుభవిస్తున్నారు. పాండవులంతా ఎవరు? ఒక్క కుంతీదేవి పుత్రులే. ఒకే తల్లి, ఐదుమంది కుమారులు. ఇదొక హేండ్ కర్చీఫ్. అనేక దారములు ఏకమై ఈ కర్చీఫ్ రూపాన్ని ధరిస్తున్నాయి. దారములు దండిగా ఉన్నాయిగాని, కర్చీఫ్ మాత్రం ఒక్కటే ఉంటున్నది. ఇక్కడ పిల్లలందరూ వేరువేరుగా కనిపిస్తున్నారు. కాని, All are one (అందరూ ఒక్కటే). 'మీరు ఏ కాలేజీలో చదువుతున్నారు?' అని అడిగితే, 'మేము సత్యసాయి కాలేజీలో చదువుతున్నాము', అని చెబుతారు. ఈవిధంగా మీరు ఏకత్వాన్నే చూడాలిగాని, అనేకత్వమును చూడకూడదు. అనేకత్వములోని ఏకత్వమే సత్యము. కాబట్టి, ఏకత్వాన్ని అభివృద్ధిపరచుకోవడానికి తగిన ప్రయత్నం చేయండి.

ప్రేమస్వరూపులారా! మిమ్మల్ని చూస్తుంటే నాకెంతో ఆనందం వేస్తుంది. తెల్లవారినది మొదలు రాత్రి పరుండునంతవరకు అనేక కార్యక్రమాలలో పాల్గొంటూ, మీకు ఆనందాన్ని అందిస్తూ, నేను ఆనందంగా ఉంటుంటాను. ఇట్టి ఆనందము ఎవరికైనా చిక్కుతుందా? దూషణ, భూషణ, తిరస్కారములను నేను లెక్కచేయను. ఎవరి భావాలను బట్టి వారు మాట్లాడుతుంటారు. నాకు ఆ భేదమే లేదు. నేను ఎప్పుడూ ఆనందంగానే ఉంటాను. నాకు అందరూ ఒక్కటే. All are one, be alike to everyone.

(2005 అక్టోబరు 9వ తేదీ దసరాల్లో సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)